క్లుప్తంగా

బూరుగడ్డ ఆలయంలో నేటి నుంచి పవిత్రోత్సవాలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద గోదాదేవి, ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శుక్రవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎంపి లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామంలో నిర్మించిన అయ్యప్ప ఆలయంలో గురువారం అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద మంత్రాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న అప్పారావు

కోదాడరూరల్ : మండలంలోని కాపుగల్లుకు చెందిన చెరుకుపల్లి నర్సింహారావు అనారోగ్యంతో కోదాడలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. శస్త్ర చికిత్సకు డబ్బు అవసరం కావడంతో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు దొంతగాని అప్పారావు గురువారం బాధితుడికి రూ.10వేల ఆర్థికసాయం చేశారు. ఆపదలో ఉన్నవారిని, చదువులో రాణిస్తున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు తనవంతుగా సహాయం చేస్తానని అప్పారావు తెలిపారు.

సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నాయకుల అరెస్ట్

నేరేడుచర్ల : బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా హుజూర్‌నగర్‌లో ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి రోడ్డుషో సందర్భంగా నేరేడుచర్లలో పోలీసులు ముందస్తుగా ప్రజాపంథా నాయకులను గురువారం అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో సయ్యద్ హుస్సేన్, వాస కరుణాకర్, గోపి తదితరులు ఉన్నారు.

సీపీఐకి జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజీనామా

హుజూర్‌నగర్ : సీపీఐ పార్టీలో ప్రశ్నించే వారిపై కక్ష సాధింపు చర్యలకు నిరసనగా ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలకూరి బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనతో పాటు పలువురు పార్టీకి రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నిరుద్యోగులకు అన్యాయం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం

నడిగూడెం : కోదాడ అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్రఅభ్యర్థి, తెలంగాణ విద్యార్థి జేఏసీ ప్రధాన కార్యదర్శి బృందావనపురంనకు చెందిన బెల్లంకొండ నవీన్‌గౌడ్ గురువారం నడిగూడెం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్నా ఉద్యోగాలు భర్తీ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో పవన్, సాయి, ప్రవీణ్, రమేష్ పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థి ప్రచారం

నడిగూడెం : మండలంలోని బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం గ్రామాల్లో కోదాడ సీపీఎం అభ్యర్థి మట్టిపల్లి సైదులు గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో సీపీఎం ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బుర్రి శ్రీరాములు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, దేవరం వెంకటరెడ్డి, మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ, షేక్ సైదా, బచ్చలకూరి స్వరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

కోదాడ : విద్యావంతుడినని, తనను గెలిపిస్తే కోదాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, అవినీతి రహిత పాలన అందిస్తానని కోదాడ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి డాక్టర్ అంజియాదవ్ కోరారు. గురువారం కోదాడ పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాలుగా కోదాడలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అమలు చేశానని, వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

చివ్వెంల : ప్రజలు ప్రశాంత వాతావరణంలో పండుగులు జరుపుకోవాలని మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మోదిన్‌పురం గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్ రెడ్డి, సర్పంచ్ నంద్యాల జనార్దన్ రెడ్డి, ఎంపీటీసీ రేణుక పాల్గొన్నారు.

కేటీఆర్ రోడ్ షో విజయవంతం

- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తరలివచ్చిన జనం
- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం



హుజూర్‌నగర్‌లో మంత్రి కేటీఆర్ రోడ్ షోకు హాజరైన ప్రజలు

హుజూర్‌నగర్ : సాధారణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్ షో విజయవంతంగా జరిగింది. వార్షాన్ని సైతం లెక్కచేయకుండా రోడ్డుషోలో నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. మంత్రి కేటీఆర్ రాక ఆలస్యం కావడంతో బీఆర్‌ఎస్ నాయకులు అడ్డరోడ్డులో ఆటపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అయితే మధ్యాహ్నం వర్షం కురవడంతో రోడ్డుషో జరుగుతుందా.. వాయిదా పడుతుందా అనే సందిగ్ధం నెలకొంది. హుజూర్‌నగర్‌కు ఉదయం 10 గంటలకు రావాల్సిన మంత్రి కేటీఆర్ వర్షం కారణంగా మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్ ద్వారా పట్టణానికి చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద ఎమ్మెల్యే సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక వాహనంలో రోడ్డుషో లింగగిరి రోడ్డు నుంచి ప్రారంభమై పొట్టి శ్రీరాములు సెంటర్, పాత బస్టాండ్ మీదుగా మిర్యాలగూడెం అడ్డరోడ్డుకు చేరుకుంది. దారి పొడవునా మంత్రి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అడ్డరోడ్డులో మంత్రి ప్రజలనుద్దేశించి 16 నిమిషాల పాటు మాట్లాడారు. వర్షం వచ్చినా కూడా ప్రజలు కేటీఆర్ ప్రసంగం వినేందుకు ఆసక్తి చూపారు. వర్షానికి కూడా వెరవకుండా ప్రజలు వచ్చిన ఈ ర్యాలీని చూస్తుంటే ఎన్నికల అనంతరం విజయోత్సవ ర్యాలీలాగా ఉందని మంత్రి పేర్కొనడం విశేషం.

ఉత్తమ క్లబ్‌గా 'కోదాడ వాసవీ'



కోదాడ వాసవీ క్లబ్ సభ్యులకు అవార్డులు అందజేస్తున్న క్లబ్ జిల్లా గవర్నర్ గురుమూర్తి

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం వాసవీ క్లబ్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సంవత్సరం కోదాడ క్లబ్ చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి ఆ క్లబ్‌ను ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉత్తమ క్లబ్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కోదాడ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మడి సతీష్‌బాబు, కార్యదర్శి షేకు శ్రీనివాసరావు, కోశాధికారి వెంపటి ప్రసాద్‌లకు బంగారు పథకాలు, జ్ఞాపికలను క్లబ్ జిల్లా గవర్నర్ వంగవేటి వెంకటగురుమూర్తి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోదాడ వాసవీ క్లబ్ చేసిన సేవలకు తగిన గుర్తింపు లభించిందన్నారు. తదనంతరం ఇమ్మడి సతీష్ మాట్లాడుతూ తమ క్లబ్ నుంచి అనేక సామాజిక, ధార్మిక, సేవా కార్యక్రమాలు, పేద మహిళలకు పట్టు చీరలు, వైద్య, రక్తదాన శిబిరాలు, అన్నదానాలు, సైనికులకు, రైతులకు సత్కారాలు చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఐపీసీ చల్లా విజయశేఖర్, జగిని ప్రసాద్, చల్లా లక్ష్మీనర్స య్య, రంగా కోటేశ్వరరావు, గుడుగుంట్ల సాయి, పత్తి నరేందర్, లోకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన సీపీఎం

హుజూర్‌నగర్ : సీపీఎం ప్రజల పక్షాన ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తోందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మల్లు లక్ష్మి అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించి సీపీఐఎం పార్టీ తన సత్తా చాటాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.పాండు, పల్లె వెంకట్ రెడ్డి, బ్రహ్మం, సైదులు, రజిత, జ్యోతి, సైదమ్మ, నర్మద, హుస్సేన్, శీలం శ్రీను, వీరయ్య, కౌన్సిలర్ త్రివేణి, లింగమ్మ, మట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలు నమ్మవద్దు



కోదాడ : ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్



కోదాడ : 21వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్

- కోదాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : కాంగ్రెస్ పార్టీ చెపుతున్న మాయమాటలను ప్రజలు నమ్మవద్దని, చుట్టపుచూపుగా వచ్చే వాళ్లను ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని కోదాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. గురువారం కోదాడ పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండే తనను గెలిపించాలని కోరారు. కోదాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశం ఇస్తే పట్టణ రూపు రేఖలు మార్చివేస్తానని ఆయన అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, కేసీఆర్‌ను మూడవసారి సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, వనపర్తి లక్ష్మీనారాయణ, కట్టెబోయిన జ్యోతి, రామినేని సత్యం తదితరులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే లక్ష్యం : ఎంపీ

కోదాడ : కోదాడలో అభివృద్ధి కొనసాగాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ కోరారు. గురువారం కోదాడ పట్టణంలో మల్లయ్యయాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రైతబంధు సాయాన్ని పెంచుతామని తెలిపారు. ఆసరా పింఛన్లు రూ. 5 వేలకు పెంచడంతో పాటు గ్యాస్ సిలిండర్‌ను నాలుగు వందలకే ఇవ్వనున్నామన్నారు. కోదాడ నియోజకవర్గంలో ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండే మల్లయ్యయాదవ్‌ను మరోసారి గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. మూడవసారి కేసీఆర్ సీఎం కాబోతున్నారని, దీంతో కోదాడ పట్టణానికి కావాల్సిన నిధులను తీసుకొచ్చి అభివృద్ధి చేసే బాధ్యతను మల్లయ్యయాదవ్ తీసుకుంటాడని అన్నారు. కార్యక్రమంలో కోదాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్, కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వనపర్తి శిరీష, లక్ష్మీనారాయణ, కందుల మధు, కట్టెబోయిన జ్యోతి, శ్రీనివాస్, రామినేని సత్యం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

మునగాల : కోదాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్యయాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం మండలంలోని బరాఖత్‌గూడెంలో బీఆర్‌ఎస్ వర్గాలు ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల మేనిఫెస్టోను ఓటర్లకు వివరించి బీఆర్‌ఎస్ అభ్యర్థికే ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఏనుగుల నాగేశ్వరరావు, ఉప్పల ఇంద్రారెడ్డి, బొంతు మోహన్‌రావు, గోదాటి వెంకయ్య, ఎస్‌కే.యూసుఫ్, షేక్ రంజాన్, గుడిపాటి కనకయ్య, మొలుగూరి వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

తలకిందులు తపస్సు చేసినా బీఆర్‌ఎస్ గెలవదు

- హుజూర్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



హుజూర్‌నగర్ : దొండపాడు నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : కేసీఆర్ కుటుంబం పొర్లు దండాలు పెట్టినా, తలకిందులు తపస్సు చేసినా బీఆర్‌ఎస్ గెలవదని హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి హుజూర్‌నగర్‌లోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పదేళ్ల అధికారం అనుభవించి అధికార మదంతో మంత్రి కేటీఆర్ విర్రవిగుతున్నాడని అన్నారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం పేరుతో కోట్ల రూపాయల కమీషన్లు తీసుకొని, ఆ డబ్బుతో ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం, కాళేశ్వరం ప్రాజెక్ట నిర్మాణంలో జరిగిన అవినీతి అక్రమాలు, కేసీఆర్ చేసిన మోసాలపై జాతీయ స్థాయిలో చర్చ జరుగుతుందని అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం కేసీఆర్ అవినీతికి పరాకాష్ట అని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో తెలంగాణ సంపదను కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆరోపించారు. తెలంగాణలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేరుతో రెండుసార్లు నోటిఫికేషన్లు వేసి వాటిని రద్దు చేసేలా కుట్రలు చేశారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో వందల మంది యువత ఉద్యోగాలు రాక నిరాశా నిస్పృహలతో ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువకుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలుగా భావించాలని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనేని అన్నారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే నీవు, నీ అయ్యా ఎక్కడ ఉండేవారని కేటీఆర్‌ను ఆయన ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నిర్వీర్యం చేసి ఉద్యమకారులను కూడా మోసం చేశారని ఆయన ఆరోపించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాకముందే 2004లోనే కాంగ్రెస్ పార్టీ 24 గంటల ఉచిత విద్యుత్ అందించిందని గుర్తు చేశారు. హుజూర్‌నగర్‌లో గెలిచేది కాంగ్రెస్ పార్టీ అని, 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 80 స్థానాల్లో గెలవబోతుందని జోస్యం చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ కర్ణాటక ప్రభుత్వంపై కేసీఆర్, మంత్రి కేటీఆర్ అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో నాయకులు తన్నీరు మల్లికార్జునరావు, యరగానీ నాగన్న, ఈడుపుగంటి సుబ్బారావు, దొంగరి వెంకటేశ్వర్లు, గూడెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ 'గ్యారంటీ'లను తీసుకెళ్లాలి

హుజూర్‌నగర్ : గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను తీసుకెళ్లాలని కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ అన్నారు. గురువారం చింతలపాలెం మండలం దొండపాడు బీఆర్‌ఎస్ నాయకులు ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఉత్తమ్ కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో రేల చిన్న వెంకటరెడ్డి, యర్రడ్ల సుధాకర్ రెడ్డి, యర్రడ్ల శివారెడ్డి, యర్రడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కలగొట్ల వెంకట్‌రెడ్డి, రేల వాసు, రేల శివ రామకృష్ణారెడ్డి, పోటు బచ్చయ్య, జడపంగు వీర బాబులతో పాటు మరో 20 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సరాల కొండారెడ్డి, నాయకులు గోపిరెడ్డి పుల్లారెడ్డి, కొండా వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కలగొట్ల బాలిరెడ్డి, సీహెచ్.వెంకయ్య, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



నేరుడుచర్ల : విజయదుర్గ ఆలయంలో సామూహిక వ్రతం నిర్వహిస్తున్న మహిళలు



గరిడేపల్లి : సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న మహిళలు

గరిడేపల్లి : కార్తీక మాసం సందర్భంగా మండలంలోని కీతవారిగూడెం గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం సామూహిక లక్ష కుంకుమార్చన, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ గణపతి పూజ, రుద్రాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొంగరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కీత శ్రీనివాస్, ఒరుగంటి వెంకటరమణ దంపతులు, పూజారులు రాయప్రోలు రామయ్య శర్మ, భద్రయ్య శర్మ, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం

నేరేడుచర్ల : పట్టణంలోని విజయదుర్గ మల్లేశ్వరిస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా గురువారం శ్రీరామ సమేతా శ్రీసత్యనారాయణస్వామి దివ్య కల్యాణ మహోత్సవం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మొలుగు శ్రీనివాసశర్మ వేమంత్రోత్సవాల మధ్య సాంప్రదాయబద్ధంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చేకూరి కిశోర్, ముక్కపాటి వెంకటేశ్వర్‌రావు, ముక్కపాటి శ్రీనివాస్, సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

మాలధారులకు అన్నదానం

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్‌లో గల గాలి రమేష్ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ అన్నదానంలో 550 మంది మాలధారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాసునాయుడు, సూర్యారెడ్డి, సీతారాంసింగ్ తదితరులు ఉన్నారు.

మునగాల : మండల కేంద్రం శివారులో గల శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయం ఆవరణలో గురువారం అన్నదానం నిర్వహించారు. అన్నదానానికి దేవరం నారాయణరెడ్డి– సరోజనమ్మ దంపతులు, గొడుగు సావిత్రి కుటుంబసభ్యులు, వల్లోజు వెంకటకృష్ణయ్య, కందిబండ సుశీలమ్మ, కాసాని నరేష్ –రేణుక దంపతులు సహకరించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీనివాసాచారి గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు వల్లోజు వెంకన్న, పుల్లారెడ్డి, సాంబ, సంజీవ రెడ్డి, ఈదారావు, శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

ఆదరించండి.. నిరుద్యోగులకు అండగా ఉంటా

- ఓటర్లను అభ్యర్థిస్తున్న స్వతంత్ర అభ్యర్థి పచ్చిపాల రామకృష్ణ
- గ్రామగ్రామాన ఒంటరిగా బైక్‌పై తిరుగుతూ ప్రచారం



ద్విచక్ర వాహనంపై ఎన్నికల ప్రచారం చేస్తున్న రామకృష్ణ

కోదాడఅర్బన్ : కోదాడ అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఒంటరిగానే బైక్‌పై తిరుగుతూ తెలంగాణ కోసం బీసీ విద్యార్థి సంఘం నుంచి తాను పోరాడానని, కానీ ఎన్నో ఆశలతో సాధించుకున్న స్వరాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు కల్పించకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ద్రోహం చేసిందని పేర్కొంటూ గ్రామగ్రామాన యువతను, ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్నాడు. తనను గెలిపిస్తే నిరుద్యోగులకు అండగా ఉంటానని, అసెంబ్లీలో నిరుద్యోగుల గొంతుకై వారి వాణి వినిపిస్తానని చెబుతున్నారు. కోదాడ పట్టణంలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలు, ఉచిత విద్య, వైద్యం, మంచినీటి సరఫరా, ప్రతి గ్రామంలో ఉచితంగా ఆర్వో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తానని, మొత్తం 25 అంశాల మేనిఫెస్టోతో ఆయన తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నాడు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



కోదాడరూరల్ : ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న నాయకులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని చిమిర్యాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.పద్మావతిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలతో పాటు మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు కొత్త గుర్వయ్య, పూర్ణ, అప్పారావు తదితరులు ఉన్నారు.

మోతె మండలంలో..

మోతె : కోదాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతిని గెలిపించాలని ఆ పార్టీ ఆధ్వర్యంలో గురువారం గోప తండా, కరక్కాయలగూడెం, రావిపహాడ్, మోతె గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలు పంపిణీ

చిలుకూరు : మండల వ్యాప్తంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాల కరపత్రాలను ఆ పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని హామీ ఇచ్చారు.

మల్లయ్యయాదవ్‌ను గెలిపించాలి

నడిగూడెం : అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్‌ను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని గురువారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆ పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బడేటి చంద్రయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ వైస్ ఎంపీపీ మృతి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే అనిరెడ్డి పున్నారెడ్డి కుమారుడు, మాజీ వైస్ ఎంపీపీ అనిరెడ్డి జనార్దన్‌రెడ్డి (70) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో అతడికి డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం తదితరులు నివాళులర్పించారు. మృతుడు జనార్దన్‌రెడ్డి జాజిరెడ్డిగూడెం సర్పంచ్‌గా, వైస్ ఎంపీపీ పనిచేశారు.

కాంగ్రెస్ గెలుపుతోనే కోదాడ అభివృద్ధి

- కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి



కోదాడ : ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు

కోదాడ : కాంగ్రెస్ పార్టీ గెలుపుతోనే కోదాడ అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రతిఒక్కరూ ఎన్నికల్లో తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతి కోరారు. గురువారం కోదాడ పట్టణంలోని భవానీనగర్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోదాడలో ప్రజలు వారి పనులు వారు చేసుకునేలా, వ్యాపారాలు చేసుకొనే విధంగా స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు బీఆర్‌ఎస్‌ను వీడి ఆమె సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఏర్నేని బాబు, వంగవేటి రామారావు, ఈదుల కృష్ణయ్య, సామినేని ప్రమీల, ఓరుగంటి ప్రభాకర్, షమ్మి, జబ్బార్, పబ్బా గీత, బాగ్దాద్, నలజాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ ఖాయం

మునగాల : అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ రావడం ఖాయమని కోదాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నలమాద పద్మావతి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆమె మునగాల మండలం కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీ నుంచి సుమారు రెండు వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గణపరం క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన రోడ్డు షోలో ఆమె మాట్లాడారు. తాను బెంగళూరులో ఉంటానని, ప్రజలకు అందుబాటులో ఉండనని బీఆర్‌ఎస్ అభ్యర్థి తనపై చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. తనకు, ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఎటువంటి వ్యాపారాలు లేవని కేవలం ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోదాడ నియోజకవర్గ నాయకులు ముత్తవరపు పాండురంగారావు, మాతంగి బసవయ్య, ఎంపీపీ బిందు, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, ఎంపీటీసీ ఉప్పల రజిత, కాసర్ల కల్పన, నాయకులు నల్లపాటి శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, జానకిరెడ్డి, మోహన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, వీరబాబు, శంకర్, గ్రామశాఖ అధ్యక్షులు,




మునగాలలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతి

సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నాయకులు

మోతె : మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కోదాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పద్మావతి సమక్షంలో సిరికొండ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ ఉపసర్పంచ్ బొర్ర మధుసూదన్, 4వ వార్డు సభ్యుడు కొమరగిరి గోవర్ధనాచారితో పాటు 40 కుటుంబాలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పీసీసీ కిసాన్ సెల్ కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు నూకల మధుసూదన్‌రెడ్డి, నందిగామ కృష్ణారెడ్డి, సతీష్‌బాబు, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మోతె : పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలి

కోదాడ : పట్టణంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలంటే ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. గురువారం కోదాడ పట్టణంలో, ప్రధాన రహదారి వెంట కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బషీర్, బాగ్దాద్, బాజాన్, అంబడికర్ర శ్రీనివాస్, గురుమూర్తి, మైసా రమేష్, పాశం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఓటమి ఖాయం

నడిగూడెం : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి ఖాయమైందని కోదాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. గురువారం మండలంలోని తెల్లబల్లి, ఎకలాస్‌ఖాన్‌పేట, రామాపురం, చాకిరాల, శ్రీరంగాపురం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం

పెన్‌పహాడ్ : మాచారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం దేవతామూర్తుల విగ్రహాలు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, దాతల సహకారంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పూజారులు ఇరువంటి వెంకటరమణ, నరేందర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు ఆలయ నిర్మాణానికి రూ.లక్ష చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ బొల్లక సైదమ్మ, ఎంపీటీసీ నాగు నాయక్, న్యాయవాది గ్రంథి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ పిన్నాని కోటేశ్వర్‌రావు, దాతలు ఉన్నారు.